ప్రజాశక్తి
గురువారం 12 అక్టోబర్ 2023

వేరుశనగ పంటను తొలగిస్తున్న రైతులు

పంట రాదని..
ఆశలు వదులుకుని..!

ప్రజాశక్తి-గుడిబండ

ఖరీఫ్ పంట సాగు రైతులకు గుండెకోతనే మిగిల్చింది. తీవ్ర వర్షాభావంతో సాగు చేసిన అరకొర పంట కూడా చేతికందకుండా పోయింది. పంటపై ఆశలు వదులుకున్న రైతులు వాటిని తొలగించేస్తున్నారు. ఇలాంటి పరిస్థితే గుడిబండలో నెలకొంది. గుడిబండకు చెందిన మహిళా రైతులు పుట్టరంగమ్మ, లక్ష్మమ్మ, గిరియమ్మ, జయలక్ష్మమ్మ, గిరీష్, శీనప్ప తదితరులు వారు సాగుచేసిన వేరుశనగ బుధవారం నాడు ట్రాక్టర్లతో తొలగించేశారు. ఖరీఫ్ ప్రారంభంలో వచ్చిన అరకొర వర్షానికి వీరు విత్తనాలు వేశారు. ఆతరువాత వర్షం రాకపోవడంతో పంట మొత్తం ఎండిపోయింది. దీంతో చేసేది లేక పంటను తొలగించేశారు. పంట సాగు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేశామని, వర్షాభావంతో పంట మొత్తం పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతటి దయనీయ పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

అనేక వాయిదాల తరువాత నేడు గృహ ప్రవేశాలకు ముహూర్తం కుదిరింది. అనంతపురం జిల్లాలో తాడిపత్రిలోని సజ్జలదిన్నె గ్రామ పరిధిలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా దీనిని ప్రారంభించనున్నారు. రెండు సంవత్సరాలుగా ముహూర్తాలు పెట్టడం, తరువాత వాయిదా వేయడం జరుగుతూ వచ్చింది. అయితే ఇప్పుడు వాటిని ప్రారంభించేందుకు సిద్ధం అయ్యారు.

ఎట్టకేలకు గృహోత్సవాలు

- సజ్జలదిన్నెలో వర్చువల్‌గా నేడు ప్రారంభం
- ఇంకా చాలా వరకు పెండింగ్‌లో నిర్మాణాలు
- కాలనీల్లో మౌలిక వసతుల సమస్య

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా 1,00328 గృహ పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో 76,169 గృహాలు మంజూరయ్యాయి. ఇప్పటికి 20,345 గృహాలు ఇప్పటికీ పూర్తయ్యాయి. అనంతపురం నియోజకవర్గం పరిధిలో 2275, గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో 3126 గృహాలు, శింగనమల నియోజకవర్గం పరిధిలో 2298 గృహాలు, తాడిపత్రిలో 1265, రాప్తాడులో 3013, కళ్యాణదుర్గంలో 1789, రాయదుర్గంలో 1522, ఉరవకొండలో 5075 గృహాలు పూర్తయ్యాయి. మొత్తంగా 20,345 గృహాలు పూర్తయ్యాయి. ఇంకా 55,824 గృహ నిర్మాణాలు పూర్తవ్వాల్సి ఉంది.

ఇంకా పూర్తవని మౌళిక సదుపాయాలు

జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాల కల్పన పూర్తవలేదు. మొత్తం 216 కాలనీల్లో నీటి సరఫరా కోసం పనులు చేపడితే ఇంకా సగం కాలనీల్లో పూర్తవలేదు. 508 పనులు చేపడితే అవి కూడా సగానికి సగం పూర్తవలేదు. ముఖ్యమంత్రి ప్రారంభించే సజ్జలదిన్నె కాలనీలోనూ ఇంకా మౌలిక సదుపాయల కల్పన పూర్తవలేదు. అంతర్గత రహదారులు పూర్తవ్వాల్సిఉంది. ఇళ్ల నిర్మాణాలు కొంతవరకే పూర్తయ్యాయి. అనేక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు.

గతేడాది ఉగాదిలోనే ప్రారంభిస్తాం

ఇళ్ల నిర్మాణాలను గతేడాది ఉగాదిలోనే ప్రారంభిస్తామని హడావుడి నడిచింది. తరువాత ఇది వాయిదా పడింది. అనంతరం మరో రెండు పర్యాయాలు తేదీలు ఖరారైనప్పటికీ పూర్తవకపోవడంతో వాయిదాలుపడ్డాయి. ఎట్టకేలకు మూడో వంతు వరకు ఇళ్లు పూర్తయ్యాయి. తక్కిన ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వాల్సి ఉంది. కొన్ని చోట్ల కేటగిరి-3 కింద చేపట్టిన ఇళ్లు కూడా పూర్తవలేదు. కాంట్రాక్టర్లకు ఇళ్ల నిర్మాణాలు అప్పగించినప్పటికీ అవి కొంత వరకు మాత్రమే పురోగతి సాధించాయి. ఆ కాలనీల్లోనూ ఇళ్లు నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని లే అవుట్లలో ప్రారంభానికే నోచుకోలేదు. అనంతపురం నగరం పరిధిలో ఒక లేఅవుట్‌లోనే సుమారు ఐదు వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. కాని స్థలం అనుకూలంగా లేకపోవడంతో ఆ లేఅవుట్‌ను రద్దు చేశారు. ఆ స్థానంలో కొంత లేఅవుట్ ఇప్పటికీ గుర్తించలేదు. దీంతో నగరంలో ఐదు వేల మంది ఇంకా ఇంటి స్థలం కోసం ఎదురు చూస్తేనే ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం
కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఏలుకుంట్ల గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లను పరిశీలించారు. ప్రత్యేక వైద్యులు, వైద్య బందం డాక్టర్లు పుష్పలత, దిలీప్‌కుమార్, వినోద్ కుమార్, పాల్ జివిఎన్‌లతో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య బందం రోగులకు నాణ్యత కలిగిన వైద్యంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవలని సూచించారు. ఆప్తాలిక్ డాక్టర్ ఉరుకుందప్ప ఆధ్వర్యంలో 70 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో తిప్పేనాయక్, మెడికల్ స్పెషలాఫీసర్ చాంద్‌బాషా, డిఎంహెచ్ఒ ఎస్‌వి.కృష్ణారెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సాల్మన్, సిహెచ్ఒ కళావతి, ఈవోఆర్డీ మమతాదేవి, సీనియర్ అసిస్టెంట్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములు పేదలకు పంచాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రభుత్వ భూములు, బంజర్లు పేదలకు పంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో భూ సదస్సుకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను చైతన్య పరచి భూ పోరాటాలకు సన్నద్ధం చేసే విధంగా ఈనెల 13 న పెనుకొండలో భూ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భూ పంపిణీని నవరత్నాలలో చేర్చి దశరత్నాలుగా మార్చి ప్రభుత్వం బంజర్లు మిగులు భూములను పేదలకు పంచాలన్నారు. అసైన్డ్ చట్ట సవరణను రద్దుచేసి అన్నిక్రాంతమైన భూములను తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. రైతుల భూములను బలవంతంగా సేకరించడం ఆపాలన్నారు. భూములు సేకరిస్తున్న చోట 2013 చట్ట చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పేదల చేతుల్లో ఉన్న స్థలాలకు గుడిసెలకు పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి ఆరు లక్షల రూపాయలు మంజూరు చేయాలన్నారు. భూములకై పోరాడుతున్న పేదలపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 13న పెనుగొండలో నిర్వహించే భూ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రెడ్డి, రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తదితరులు హాజరవనున్నారని తెలిపారు. ఈ సదస్సుకు పేదలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి బ్యాళ్ల అంజి, సీనియర్ నాయకులు రామకృష్ణ, ముత్యాలు, ఫక్రుద్దీన్, పవన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు 70 ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

దసరా పండుగ పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలో 70 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, విజయవాడ నగరాల నుంచి ఉమ్మడి జిల్లా అనంతపురంతో పాటు సత్యసాయి జిల్లాకు ఈనెల 18 నుంచి 23 వరకు 70 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. హైదరాబాదు నుంచి 30 సర్వీసులు బెంగళూరు నుంచి తిరుపతి నుంచి 10 సర్వీసులు విజయవాడ నుంచి ఐదు సర్వీసులు కాక ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ సర్వీసులకు సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. దూర ప్రాంత ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. అలాగే తిరుగు ప్రయాణంలో ఈనెల 24 నుంచి 25వ తేదీ వరకు ముఖ్యమైన నగరాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఈ సదుపాయాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్‌టిఐ పెద్దన్న, గ్యారేజీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

13న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి కదిరి అర్బన్

జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేస్తున్నఎమ్మెల్యే, తదితరులు

ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం జరిగిన కార్యక్రమంలో జాబ్‌మేళాకు సంబందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రేగాటిపల్లి సర్పంచి సురేష్ రెడ్డి

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పంచాయతీ సర్పంచిగా గెలవలేని వ్యక్తి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైసిపి యూత్ నాయకులు, రేగాటిపల్లి సర్పంచి సురేష్ రెడ్డి జనసేన నాయకుడు రేగాటిపల్లి మధుసూధన్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలోని రేగాటిపల్లి సురేష్ రెడ్డి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు 40 ఏళ్లుగా రాజకీయాలతో సంబంధాలు వున్న ఎమ్మెల్యే కేతిరెడ్డివెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులపైన, ముఖ్యమంత్రి వైఎస్ కుటుంబ సభ్యుల పైనా మాట్లాడటం తగదన్నారు. ప్రతి రోజు తన ఉనికి కోసం ఎవరో ఒకరిపైనా ఆరోపణలు చేస్తున్నాడన్నారు. జనసేన తరపున ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకొని దమ్ముంటే పోటీ చేయాలని ఆయన చాలెంజ్ చేశారు. గతంలో జనసేన పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేయాలని సవాల్ చేశారు. ఆయన వార్డులో పది ఓట్లు కూడా రాలేదన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. అటు వరదాపురం సూరితోను, ఇటు పరిటాల కుటుంబంతోను సంబంధాలు పెట్టుకొని కపట డ్రామాలు ఆడుతున్నాడని ఆరోపించారు. మరోసారి ముఖ్యమంత్రిని గాని ఎమ్మెల్యే కేతిరెడ్డిని కాని విమర్శిస్తే తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపిటీసీ రవీంద్రారెడ్డి, అప్పిరెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

అర్హత వున్న ప్రతి ఒక్కరికి వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 33వ వార్డులో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న,మున్సిపల్ ఎఇ హరీష్, కౌన్సిలర్లు భాగ్యలక్ష్మి, చందమూరి నారాయణరెడ్డి.పెనుజూరి నాగరాజు, బ్రహ్మయ్య, కడప రంగస్వామి గజ్జల శివతో పాటు ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీకి చుట్టాలుగా చట్టాలు : టిడిపి

ప్రజాశక్తి- హిందూపురం

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హిందూపురం పోలీసులు చట్టాలను అధికార పార్టీకి చుట్టాలుగా మార్చారనిటిడిపి నాయకులు ఆరోపించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు నరసింహులు యాదవ్, టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతు టిడిపి తరపున ఏ చిన్న కార్యక్రమం చేపట్టిన పోలీసులు పోలీస్ 30యాక్టు పేరుతో కార్యక్రమాన్ని అడ్డుకోవడంతోమ పాటు నాయకులను అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అయితే రాష్ట్ర మంత్రి పుట్టిన రోజు పేరుతో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఒక వైపు పూర్తి మూసి వేసి రాకపోకటకు అంతరాయం కల్గిస్తుంటే పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు అంజినప్ప, నాగరాజు, రామాంజినమ్మ, శివశంకర్, రమేష్ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి బాటలు వేద్దాం

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని అన్నిశాఖల అధికారులు సమిష్టి కృషితో పనిచేసి గ్రామం పంచాయతీల అభివృద్ధికి బాటలు వేద్దామని ఎంపిడిఒ, సీడీఐ (పంచాయతీ డెవలప్మెంట్ ఇన్డెక్స్) చైర్మన్ సాయి మనోహర్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరంలో గ్రామ పంచాయతీలలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయా శాఖల వారిగా నమోదు చేయాలన్నారు. తద్వారా ఆయా పంచాయతీలకు ర్యాంకులను కేటాయిస్తారన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎస్ఐ శ్రీనివాసులు ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-హిందూపురం

రైతులు పండించే ప్రతి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును ఎపి రైతు సంఘం నాయకులు పరిశీలించారు. చింత పండు ధరలను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరలకు చింత పండు కోనుగోలు చేసి, వాటిని కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచి ఇప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. చింత పండుతో పాటు వేరుశనగ ,మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా మార్కెట్ ధరను ప్రభుత్వం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు రమణ, గోవింద్ రెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అడిగితే బెదిరింపులా..?

ప్రజాశక్తి- చిలమత్తూరు

ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పంచాయతీ పారిశుధ్యకార్మికులు,స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 10 నెలల వేతనాలు చెల్లించమంటే తొలిగిస్తామని కొంత మంది సర్పంచులు, కార్యదర్శులు బెదిరించడం సరికాదని ఎపి పంచాయతీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. ఈ మేరకు సంబందిత కార్యదర్శులపై చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎంపిడిఒకు సమర్పించేందుకు రాగా అధికారి అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేష్, రామచంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు సామూహిక గృహప్రవేశాలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్ల లో నిర్మాణాలు పూర్తయిన 15931వేల ఇళ్లను గురువారం ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి ముఖ్యమంత్రి జగనన్న ఇళ్లను ప్రారంభిస్తారని, వర్చువల్ గా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లాస్థాయిలో గోరంట్ల మండలం మల్లాపల్లి నుంచి జగనన్న లే అవుట్ నుంచి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ చెప్పారు.

ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - నల్లచెరువు

తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల పరిధిలోని ఓరువాయి గ్రామ సచివాలయ పరిధిలోగల మలిరెడ్డిపల్లి గ్రామస్తులు, మహిళలు ఖాళీ బిందెలతో సచివాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. పది రోజులుగా తాగునీటి సరఫరా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. లేక దాదాపు అర కిలోమీటర్ దూరంలో గల వ్యవసాయ బోర్ల వద్ద నీటిని పట్టుకుని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలో వైసిపి నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ దీపికా వేణురెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో భారీ కేక్‌ను కట్ చేశారు. అదే విధంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సమన్వయ కర్త కొండురు వేణుగోపాల్ రెడ్డి, వేణురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మేన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత రెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణప్ప, బాణాల శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పే చర్చపై సీఆర్పీకి అభినందన

ప్రజాశక్తి - బత్తలపల్లి

విద్యార్థుల పరీక్షల విధానపరమైన అంశాలను తెలుసుకునేందుకు దేశంలో అమలు చేసేందుకు పరీక్ష పే చర్చ 2023 పై తగిన సూచనలు చేసినందుకు గాను మండలంలోని అప్పరాచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్ వెంకటరమణను అభినందిస్తూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేరు మీద అభినందన లేఖను పంపారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి పోస్టల్ ద్వారా వచ్చిన అభినందన లేఖను బుధవారం పాఠశాలలో మండల విద్యాధికారులు చాముండేశ్వరి, సుధాకర్నాయక్ చేతులు మీదుగా అందుకున్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు, అధికారులు

14న ఉచిత గుండె వైద్యశిబిరం

పెనుకొండ : ధర్మవరం ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనంతపురం నగరానికి చెందిన మార్క్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఈ నెల 14న పట్టణంలోనిఆఫిషియల్ క్లబ్ లో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హుస్సేన్ పీరా, పెనుకొండ సీఐ రాజా రమేష్, గోరంట్ల సీఐ సుబ్బరాయుడు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ. నారాయణస్వామి స్థానిక యుటిఎఫ్ నాయకులు రమేష్, రవీంద్ర, పెద్దిరాజు, గంగాధర్, సత్యమయ్య, ఉపేంద్ర, నాగేంద్ర, ఆది జినేష్, సుదర్శన్, పాల్గొన్నారు.

గ్రామాధికార పునరుద్ధరణపై అవగాహన

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొల్ల వెలుగు కార్యాలయంలో గ్రామ అధికార పునరుద్ధరణ కార్యక్రమంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఐబి డిపిఎం నాగరాజు హాజరై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం, విఒ స్థాయిలో గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం నాగరాజు, కోఆర్డినేటర్ లక్ష్మీకాంత తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ దుస్తులను ధరించండి

ధర్మవరం టౌన్ : ఖాదీ వస్త్రాలను ధరించాలని శివానగర్ రేషన్ ఖాదీ గ్రామోజోగ్ సంస్థ అధినేత చాగంటి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో బాపూజీ మొదలు పెట్టిన ఖాదీ స్వదేశీ ఉద్యమం నుండి మొదలైన ఖాదీ వస్త్రం వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత పొందిందని అన్నారు. అనంతరం పట్టణంలోని రేషం గ్రామోద్యోగ ఖాదీ సిల్క్స్ సంఘం ఖాదీ మహోత్సవాన్ని అక్టోబర్ 2 నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖాదీఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసిన ప్రతి కార్యక్రమాన్నీ వివరిద్దాం

తలుపుల : ప్రజలకు మంచిచేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు వివరిద్దామని స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్ నందు జెసిఎస్ ఇన్‌ఛార్జులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కి జగన్ ఎందుకు కావాలంటే" కార్యక్రమం పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

ముదిగుబ్బ : స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ సుగుణాబాయి తెలిపారు. అండర్ - 17 విభాగంలో ఇద్దరు అమ్మాయిలు తన్మయి, మంజుల ఎంపిక అయినట్లు చెప్పారు. వీరు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరము లో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలలో పాల్గొంటారని పాఠశాల పీడీ రేఖ చెప్పారు.

15న వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

బత్తలపల్లి : మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో ఈ నెల 15న వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా బోయ సంఘం అధ్యక్షులు బోయ సాంబశివ, తలారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం బత్తలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అనంతపురం ఎంపీ పీడీ రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్పర్సన్ గిరిజమ్మతో పాటు పలువురు బోయ, వాల్మీకి సోదరులను ఆహ్వానించినట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని గువ్వలగుట్టపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఇఒ ప్రసాద్ తనిఖీ చేశారు . ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు.

తుంపర సేద్యంపై అవగాహన

గోరంట్ల రూరల్ : బిందు తుంపర సేద్యంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఎపిఎంఐపి పీడీ సుదర్శన్ సూచించారు. బుధవారం గోరంట్ల మండలంలోని వానవోలు పంచాయతీ ఉగ్రారం పల్లిలో రైతు పెద్దన్న పొలంలో బిందు తుంపెర సేద్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన రైతులు బిందు తుంపర పరికరాలు, వ్యవసాయ పనిముట్ల కోసం గ్రామ సచివాలయాలలో నమోదు చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు 'పురం' విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండల పరిదిలోని కిరికెర ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో హెచ్ఎం భారతి, కోచ్ రీయాజ్‌బాషా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కేరళలోని తిరువనంతపురంలో సౌత్ జోన్ పెంకాక్ సిలాట్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో ఎల్ ఆర్ జి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మధుర, మీన, తనీశ్వర్ రెడ్డి, ఈశ్వర్, జైనీల్ రెడ్డి ప్రతిభ కనపర్చినట్లు చెప్పారు. దీంతో వారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

ప్రభుత్వ చర్యలతో రాయలసీమకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి మడకశిర

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

కృష్ణా జలాల పున: పంపిణీ వల్ల రాయలసీమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అసమర్థత, చేతగానితనం వల్లే కేంద్ర మంత్రిమండలి కృష్ణా జలాలను పున:పంపిణీ చేయాలనే నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈ నిర్ణయం రాయలసీమ ప్రాంత సాగునీటి ప్రయోజనాలకు నష్టం చేకూర్చుతుందన్నారు. రాయలసీమ బిడ్డగా చెప్పుకునే ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఉదాసీనత నిర్లక్ష్యం వల్ల కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ వాటాలో కోతపడిందని దీంతో రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సందర్భంగా ఏపీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా తెలంగాణ డిమాండ్‌కు అనుగుణంగా కృష్ణా జలాల పున్న సమీక్షకు నిర్ణయం తీసుకుందని విమర్శించారు.ఈ సమావేశంలో టిడిపి నాయకులు కోట్ల రంగేగౌడ, కృష్ణమూర్తి, వెంకటేష్ రెడ్డి, కరియన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలుచేయాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారస్సులను అమలు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 13న పెనుకొండలో నిర్వహించే పేదల భూమికోసం రాష్ట్ర సదస్సుకు సంబంధించి కరపత్రాలను నాయకులు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రెండవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ భూములు, పేదల భూములను అదానీ, అంబానీలకు కట్టపెడుతోందన్నారు. పేదలకు అనుకూలమైన చట్టాలను పెట్టుబడిదారులు కార్పొరేట్లకు అనుకూలంగా మార్చుతుందన్నారు. అన్యాక్రాంతమైన భూములను తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌హెచ్. బాషా, సిఐటియు మండల అధ్యక్షులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం
కాపాడిన రైల్వే పోలీసులు

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వేస్టేషన్లో ఓ మహిళ తన కుమార్తెతో కలిసి బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా గమనించిన రైల్వే పోలీసులు ఆమెను కాపాడారు. ధర్మవరం జీఆర్పీ ఎస్ఐ గోపికుమార్ తెలిపిన వివరాలు... పట్టణంలోని యాదవవీధికి చెందిన వెంకటేశ్వర ప్రసాద్ భార్య సుజాత తన కుమార్తెతో కలిసి రైల్వేస్టేషన్లో రైలుకింద పడి చనిపోవాలని ప్రయత్నించింది. అక్కడే ఉన్న రైల్వే జీఆర్పీ ఎస్ఐ గోపికుమార్, కానిస్టేబుల్ షణ్ముకాందరెడ్డి గమనించి ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. స్టేషన్‌కు పిలుచుకువెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. తన భర్త వెంకటేశ్వర ప్రసాద్ చెడువ్యసనాలకు బానిసై అప్పులు ఎక్కువగా చేశాడని అందుకే జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాననిసుజాత రైల్వేపోలీసులకు తెలిపింది. దీంతో భర్త వెంకటేశ్వర ప్రసాద్‌ను, అతని స్నేహితుడిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. సుజాత ప్రస్తుతం 5 నెలల గర్భవతి అని పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మడకశిర రూరల్ : మండలంలోని జిల్లెడుకుంట గ్రామ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ సిఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ లోకేష్ సీజ్ చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక మద్యం విక్రేతపై కేసు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గూడ్స్ కొట్టాలలో సచివాలయ కన్వీనర్ మల్లికార్జున అక్రమంగా కర్నాటక మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. మల్లిఖార్జున కర్నాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి మల్లికార్జునను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు. మల్లికార్జున ఇదివరకే కర్నాటక మద్యం అమ్ముతూ చాలా సార్లు పట్టుపడ్డాడని స్థానికులు తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్

బత్తలపల్లి : తాడిమర్రి మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. బొలెరో వాహనంలో అక్రమంగా కర్నాటకకు తరలిస్తున్న వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని నార్సింపల్లి గ్రామ శివార్లలో అరెస్టు చేసి అతనినుండి నుండి 70 బస్తాల రేషన్ బియ్యం, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న అధికారులు

ఏసీబీకి పట్టుబడిన నిందితుడికి జైలు

పుట్టపర్తి క్రైమ్ : గతంలో పెనుకొండ మండలం గుట్టూరు గ్రామ విఆర్‌ఒగా పనిచేసిన రంగనాథ్‌కు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడిన కేసులో కోర్టు జైలు శిక్ష వేసింది. రంగనాథ్ పెనుగొండ మండలం, వెంకటగిరి పాలెం కు చెందిన రెడ్డి వారి మల్లికార్జునకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు విషయంలో రూ.5వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండిల్‌గా రంగనాథ్‌ను పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ కోర్టు బుధవారం రంగనాథ్‌కు శిక్ష విధించింది. 3 సంవత్సరాల జైలు శిక్ష, 50 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ ప్రత్యేక కోర్టు బుధవారం తీర్పు ఇచ్చినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయులపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు కనీసం ప్రతి నెల అందించే వేతనాలను సైతం సకాలంలో అందించడం లేదని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మారుతీ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు, పాఠశాలల్లో విధులు నిర్వహించే ఇతర ఉద్యోగులకు అక్టోబర్ నెల 11వ తేది దాటినప్పటికి ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదన్నారు. వీరితో పాటు పెన్షనర్లకు సైతం పెన్షన్‌లు ఇవ్వలేదన్నారు. దీంతో పాటు పిఆర్‌సి బకాయిలు, డిఎ అరియర్స్, పరండర్ లీవ్ ఎన్ క్యాష్ సంవత్సరాల తరబడి ఇవ్వడం లేదన్నారు. దసర పండుగ సందర్భంగా ప్రకటించిన డిఎపై జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు నాలుగు నెలలు గడుస్తున్న ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదన్నారు. సమస్యలను దృష్టిలో పెట్టుకుని వేతనాలను ప్రతి నెల 1వ తేది నాటికి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమస్యలతో పాటు వేతనాలకు సైతం ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మడకశిర : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సెప్టెంబర్ నెల వేతనాలతోపాటు పెన్షన్లను చెల్లించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు టి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్టోబర్ నెల 11వ తేదీ వచ్చినా ఇంత వరకూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలతోపాటు పెన్షన్ సొమ్మును ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కదిరి అర్బన్

శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అన్నారు. పట్నం మెయిన్ రోడ్డు నుండి పట్నం గ్రామం వరకు రూ. 60 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డును ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పైలాన్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, మండల కన్వీనర్లు, నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర

ప్రజాశక్తి -పెనుకొండ

విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందనిరాష్ట్ర వాల్మీకి /బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంకటగిరి పాళ్యం లో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, హనుమంతు రెడ్డి, సృజన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ రెడ్డి తనయుడు రమాకాంత్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు గంపల రమణా రెడ్డి, పెనుకొండ యాక్షన్ టీమ్ అధ్యక్షులు పాలసముద్రం దిలీప్ రెడ్డి, పెనుకొండ వైసీపీ సీనియర్ నాయకులు కర్రా సంజీవ రెడ్డి, సోమందేపల్లి వైస్ ఎంపిపి వెంకట నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - మడకశిర రూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని డిప్యూటీ డిఎంహెచ్ఒ మంజువాణి తెలిపారు. మండల పరిధిలోని మెలవాయి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అగళి : మండలంలోని పి.బ్యాడిగెర పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక సర్పంచి రంగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివానంద, డాక్టర్ గాయత్రి, మండల కన్వీనర్ శ్రీనివాస్, ఎంపీపీ రేణుక కామరాజుతో పాటు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని పెద్దమత్తూరు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమంతూరు, చెరుకూరు సర్పంచులు, సుభాషిని, అశ్వర్థమ్మ, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్,తహశీల్దార్ అనంతచారితో పాటు అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని గాండ్ల వారి పల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల గురించి ప్రజలకు వివరించారు. పలు రకాల ఆరోగ్య సమస్యలపై సేవలందించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డాక్టర్లు రాజేంద్ర, నాగేంద్ర నాయక్, నాయకులు నారాయణరెడ్డి, తిరుమల సేవేనాయక్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి చరమగీతం : టిడిపి

ప్రజాశక్తి కనగానపల్లి

వైసిపికి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టు అయి పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా పలు రాజకీయ పార్టీల వారు టీడీపీ వైపే చూస్తున్నారనిఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.. రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరడమేనని అన్నారు. రామగిరి మండలం పేరూరు గ్రామంలో బాబుతోనే నేను కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో 24కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. అలాగే కనగానపల్లి మండలం శివపురం గ్రామం నుంచి 8కుటుంబాల వారు టిడిపిలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ పార్టీలోకి కొత్తగా వచ్చామన్న ఆలోచన లేకుండా పాత నాయకులతో కలసిపోయి టీడీపీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో కళ్లున్న గుడ్డిప్రభుత్వం పాలిస్తోందని టీడీపీ నాయకులు ఆరోపించారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ బుధవారం స్థానిక గాంధీనగర్ సర్కిల్లో రోడ్డుపై బైఠాయించి కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతంకాటమయ్య, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, గరుగు వెంగప్ప , నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, పరిశేసుధాకర్, దేవరకొండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేయడం తగదని మాజీ ఎమ్మెల్సీ నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ బచ్చలి పుల్లయ్య అన్నారు. 'బాబుతో నేను' అనే కార్యక్రమాన్ని కొత్తచెరువు లోనే కమ్మ పాలెంలో బుధవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు నాగేంద్రప్రసాద్, రాజు పాల్గొన్నారు.

గుడిబండ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ బుధవారం గుడిబండ కూరగాయలు, మరియు పశువుల సంత మార్కెట్లో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆధ్వర్యంలో బాబుతో నేను అంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు జవానడుకు రంగా,ఉపాధ్యక్షులు ఉమేష్, ఉపసర్పంచి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం మల్లినమడుగు గ్రామంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి బాబుతో నేను కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి, మండల కన్వీనర్ దాసిరెడ్డి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, విశ్రాంత ఇంజనీర్ మల్లికార్జున, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ సిద్ధగంగప్ప తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల స్యూరనాయణ అభిమానులు ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. బుధవారం మండలంలోని గంటాపురం, చెర్లోపల్లి, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అనంతసాగరం, ఎర్రాయపల్లి, సంజీవపురం, లింగారెడ్డిపల్లి, రాఘవంపల్లి, పొట్లమర్రి, వేల్పుమడుగు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆకులేటి వీరనారప్ప, గంటాపురం ఈశ్వరయ్య, మాల్యవంతం గోనుగుంట్ల మంజునాథ్, వెంకటచౌదరి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండలంలోని ని వైటీ రెడ్డిపల్లి, రంగాపురం, కొట్టాల గ్రామాలలో టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, సర్పంచులు నాగరాజు, మంజు, అశ్వర్థ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో మాజీమంత్రి పరిటాల సునీత

ధర్మవరంలో టిడిపి నాయకుల నిరసన

లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన

ప్రతిభా విద్యార్థికి బహుమతిని ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -పరిగి

లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన సదస్సును మండలం లోని జడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో బుధవారం కల్పించారు. లింగ వివక్షత నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలన, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వివక్షత నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీవో సరస్వతి, ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం, దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు, ప్రధానోపాధ్యాయురాలుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణ సమీపంలో కాకతీయ విద్యానికేతన్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ బాలికలు ప్రస్తుత కాలంలో విద్యా, క్రీడా, సాహిత్యం, సాంకేతిక, కళల వంటి అన్ని రకాల రంగాలలో రాణించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : బాలికలు చదువులలో రాణించి స్వశక్తితో ఎదిగి వివక్షతను పోగొట్టాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ ప్రమీల కుమారి, ఎంఇఒ మోహన్ బాబు తెలిపారు . బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పాముదుర్తి హై స్కూల్ నందు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి తరంలో బాలికలపై జరుగుతున్న వివక్షతను పోగొట్టాలంటే బాలికలు చదువులలో రాణించి పైకి ఎదగాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష , ఎటిఎల్ సుధాకర్, ఆర్డీటీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ఆర్ డి టి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినిలు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్డీటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ పర్సనల్ ఆఫీస్ మేనేజర్ ప్రసన్నకుమార్, ఎటిఎల్ సంజీవరెడ్డి, ఎస్‌టిఎల్ ఎల్లమ్మ, బాలికల పాఠశాల హెచ్ఎం రమాదేవి, పీడీ రేఖ బాలికల, తల్లిదండ్రులు, ఆర్డిటి సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను చదువుతోపాటు అన్ని రంగాలలో ప్రోత్సహించాలని సూర్య ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ నరేంద్రబాబు తెలిపారు. బుధవారం పాఠశాలలో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం జరుపుకున్నారు. ఈసందర్భంగా నరేంద్ర బాబు మాట్లాడుతూ బాలికల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శీన, నరేంద్ర, ప్రభావతి, జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు స్థానిక గీత మందిరంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నల్లచెరువు ఎస్ఐ లింగన్న హాజరై మాట్లాడుతూ బాలికలకు స్వశక్తితో ఎదగాలన్నారు. చట్టాలు,వారి యొక్క హక్కులు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుపాల్ నాయక్, ఎటిఎల్ స్వర్ణలత,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తలపల్లి :చదువు ఉంటే ఎవరిపైనా ఆధారపడకుండా జీవించవచ్చునని ఆర్డీటీ ఫండ్స్ మొబలైజేషన్ డైరెక్టర్ సాగరమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులుగా ఏఎన్ఎం రాధ. ధ్యాన గురువు శంకరయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా సాగరమూర్తితో పాటు హైదరాబాద్ లీలా, ఎస్ఐ శ్రీనివాసులు, హెచ్ఎం జయంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకుంటే సమాజంలో గుర్తింపుతో పాటు గౌరవం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎటిఎల్ రుక్మాంగద, ఎస్‌టిఎల్ సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, పాపిరెడ్డి పల్లి సమీపంలో గల కస్తూరిబా గాంధీ పాఠశాలలో బాలికలకు అంతర్జాతీయ బాలిక దినోత్సవం గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటసుబ్బమ్మ, రత్నమ్మ, ఉపాధ్యాయురాలు లక్ష్మీబాయి, కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓ అనిత, సిహెచ్ఓ శిరీష, ఎఎన్ఎం రాజా రమణి బాలికలు పాల్గొన్నారు.